
"ఏరా రాజేష్ సుధ ప్రోగ్రాంకి నువ్వు కూడా వస్తావు కదా'' అప్పుడే అక్కడకు వచ్చిన రాజేష్‌ని అడిగాడు రత్నాకర్.

"ఎవరా సుధ ఏమిటా ప్రోగ్రాం?'' అడిగాడు రాజేష్.

"టి.వి. యాంకర్ సుధ తెలియదా? ఈనెల 26వ తారీఖున తను మన ఊళ్ళో జరగబోయే 'మీ సమక్షంలో' అనే కల్చరల్ ప్రోగ్రాంకి ఏంకర్‌గా వస్తోంది. ఇంత ముఖ్యమైన విషయం నీకు తెలియదంటే ఆశ్చర్యంగా వుంది.''



"నాకు అలాంటి ప్రోగ్రామ్స్ అంటే ఇంట్రస్ట్ లేదని నీకు తెలుసు కదా. నన్ను వదిలేయ్'' అన్నాడు రాజేష్.

"ఇలా అన్నిటికీ నిన్ను వదిలేయబట్టే ఎందుకూ పని కిరాకుండా తయారయ్యావు. ఆ ప్రోగ్రాంకి వెళ్తే అందాల సుధని ప్రత్యక్షంగా చూడవచ్చు. అవకాశం వస్తే మాట్లాడవచ్చు.''

"అంత అందంగా వుంటుందా?''

"అయితే నువ్వు నిజంగానే సుధ ప్రోగ్రాం ఒక్కటి కూడా టీవీలో చూడలేదా? నువ్వు ఈ ప్రోగ్రాంకి తప్పని సరిగా రావాల్సిందే. నేను వంద రూపాయలు ఖర్చుపెట్టి మరీ నిన్ను తీసుకువెళతాను'' అన్నాడు రత్నాకర్.

"అబ్బా... వంద రూపాయలా?''

"అది సుధను చూడటానికి అయ్యే ఖర్చు. అది మాత్రం సరిపోదనుకున్నావనుకో. అయిదువేలు నీవి కావనుకుంటే సుధ ఒక రాత్రికి నీదవుతుంది.''

"ఛీ... ఛీ... నువ్వెప్పుడూ ఇంతే. అందరి గురించీ ఇలాగే మాట్లాడతావు.''

"సరేలే. నీతో నాకు వాదనెందుకు. మనం 26న సుధ ప్రోగ్రాంకి వెళుతున్నాం. అంతే.'' అన్నాడు రత్నాకర్.

***

ఆ ఆడిటోరియం విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించబడి వుంది. ఆ ప్రదేశం అంతా జనం సందడిగా తిరుగుతున్నారు. రాజేష్ స్నేహితులతో కలిసి వెళ్లి తమ సీట్లలో కూర్చు న్నారు.

ప్రోగ్రాం నిర్ణయించిన దానికన్నా గంట ఆలస్యంగా ప్రారంభమయింది. సుధ స్టేజ్ మీదకు రాగానే ఆడిటోరియం అంతా చప్పట్లతో మారుమోగిపోయింది. ఆమెను చూస్తూనే రాజేష్ ఆశ్చర్యపోయాడు.

# వెలుగు-నీడలు

## కౌశీభట్ల శశికాంత్

"అరె ఈమె నాకు తెలుసు'' అన్నాడు రాజేష్.

"నీకేమిటి. ఆమె అందరికీ తెలుసు'' నవ్వుతూ అన్నారు స్నేహితులు.

"నేను కూడా ఈమెకు తెలుసు'' అన్నాడు రాజేష్.

"ఎలా తెలుసు బాబూ! కొంపతీసి చిన్నప్పుడు మీరిద్దరూ 'తేనెటీగ, తేనెటీగ ఎందాక కుడతావే పోవే ఆవంకొ' అని పాడు కోలేదు కదా'' అన్నాడు రత్నాకర్.

"తేనెటీగ కాదురా బాబూ తూనీగ. మొత్తం పాటే మార్చే శావు'' నవ్వుతూ అన్నాడు మరో స్నేహితుడు.

"మీరు కాసేపు ఆగుతారా. ఆమె కాలేజ్‌లో నా క్లాస్‌మేట్ సాగరిక.'' అన్నాడు రాజేష్.

"ఆ గరికకి ఈ సుధకి పోలికలున్నాయేమో. అంతే కానీ ఈమె సాగరికేమిటి? సరిగ్గా చూడు''.

"డిగ్రీ మూడు సంవత్సరాలు నాతో కలిసి చది విన ఆమెను గుర్తుపట్టలేనా? అందులోనూ తను మా కాలేజీ బ్యూటీ''

"చూశావా టి.వి. చూడకపోవడం వలన జన రల్ నాలెడ్జ్‌లో ఎంత పూర్‌గా వున్నావో. లేకపోతే ఇంత ముఖ్యమైన విషయం ఇంత లేట్‌గానా తెలుసుకోవడం.''

"ఈమెను తన పేరుతో ఎవరూ పిలిచేవారు కాదు. 'బీబీ' అనే నిక్‌నేమ్‌తో పిలిచేవారు" అన్నాడు రాజేష్.

"అదేం పేరు"

"రంగు తక్కువగా వుంటుంది కదా. అందుకని బ్లాక్ బ్యూటీ అనేవారు. రెండు పాదలలోని మొదటి అక్షరాలు కలిపితే బీబీ అయింది."

"భలే కుదిరింది గురూ పేరు. ఇపుడిది ఆంధ్రా అంతటికీ బీబీ" అన్నాడు రత్నాకర్ నవ్వుతూ.

"షటప్. ఆమె గురించి ఇంకెప్పుడూ అలా మాట్లాడకు." కసురుకున్నాడు రాజేష్.

"కోపగించుకోకు గురూ. సుధ ఎలియాస్ సాగరిక ఎలియాస్ బీబీకి మమ్మల్ని పరిచయం చెయ్యాలి"

"అసలు ఆమెతో మాట్లాడడం వీలవుతుందా?" అన్నాడు రాజేష్.

"ప్రోగ్రాం అయ్యాక ట్రై చేద్దాం"

ప్రోగ్రాం అయ్యాక సుధ ఆటోగ్రాఫ్‌కోసం చాలా మంది ఆమె చుట్టూ మూగారు. ఆ గుంపుకి వెనకాల రాజేష్ స్నేహితులతో నుంచున్నాడు. స్నేహితులు రాజేష్‌ని ముందుకు తోస్తున్నారు 'వెళ్ళరా వెళ్ళి పలకరించు' అని. అతను జనాన్ని నెట్టుకుని కొద్దిగా ముందుకు వెళ్ళాడు కానీ ఆమె దగ్గరకు వెళ్ళలేకపోయాడు. అతనికి ఖంగారుగా వుంది. అనాలోచితంగా 'బీబీ' అని గట్టిగా అని నాలిక కరుచుకున్నాడు. అంత గొడవలోనూ అతని మాట వినిపించి ఆమె చటుక్కున తలెత్తి ఆ మాట వినిపించినవైపు చూసింది. రాజేష్ పక్కన నిలబడ్డవాళ్ళు అతనికేసి వింతగా చూశారు. అదే అదనుగా రాజేష్ జనాన్ని తప్పించుకుని ముందుకు వచ్చాడు. ఆమె రాజేష్‌ని చూసి గుర్తుపట్టింది.

"రాజేష్ నువ్వా?" అంది.

అంతకాలం తర్వాత కలిసినా, అంత హడావిడిలోనూ ఆమె తనను పేరుతో సహా గుర్తుంచుకోవడం రాజేష్‌కి చాలా ఆనందకరంగా అనిపించింది. సుధ రాజేష్‌ని పలకరించడంతో వీడియో కెమెరా అతని వైపు తిరిగింది. అతను మొహం చిట్లించి ఇబ్బందిగా నిలబడ్డాడు.

"కొద్దిసేపు వెయిట్ చెయ్యి" అంది.

రాజేష్, అతని స్నేహితులు వెళ్ళి ఖాళీ అయిన కుర్చీలలో కూర్చున్నారు. కొద్దిసేపు గడిచాక సుధ వాళ్ళ దగ్గరకు వచ్చింది.

"ఏదో ఖంగారులో అలా పిలిచేశాను. ఏమనుకోకు" అన్నాడు రాజేష్.

"ఫరవాలేదు. చాలాకాలం తర్వాత ఆ పిలుపు వినిపించేసరికి ఆశ్చర్యపోయాను. ఏం చేస్తున్నావు ఈ ఊళ్ళో"

"ఒక కంపెనీలో ఎకౌంటెంట్‌గా పనిచేస్తున్నాను."

"చాలా సంతోషంగా వుంది నిన్ను ఇలా కలుసుకోవడం" అందామె. రాజేష్ తన స్నేహితులని ఆమెకి పరిచయం చేశాడు. వాళ్ళు అలా మాట్లాడుకుంటూ వుండగా ఒకతను వాళ్ళ దగ్గరకు వచ్చాడు. అతన్ని చూస్తూనే సుధ లేచింది.

"రాజేష్ నేనింక వెళ్ళాలి. ఇదిగో నా విజిటింగ్ కార్డ్. నువ్వు హైదరాబాద్ వచ్చినపుడు మా ఇంటికి రా"

"నువ్వు ఇప్పుడు హైదరాబాద్ వెళ్ళిపోతావా?"

"లేదు. ఈ రాత్రికి ఇక్కడే హోటల్లో వుంటాను. ఏం అలా అడిగావు?"

"చాలా కాలానికి కలిశాం కదా. ఇవాళ మా ఇంటికి డిన్నర్‌కి రావాలి నువ్వు" అన్నాడతను, ఆమె ఒప్పుకుంటుందని నమ్మకం లేకపోయినా.

"మీ ఇంటికా?" అని ఆమె ఆశ్చర్యపోయి అంతలోనే సర్దుకుని "మరోసారి వస్తానులే" అంది.

"మళ్ళీ నీకు రావడానికి కుదురుతుందా? నీకు వేరే ఎంగేజ్‌మెంట్ ఏమీ లేకపోతే మా ఇంటికి రా. మా ఆవిడ టి.వి. తెగ చూస్తుంది. నువ్వు వస్తే సంతోషిస్తుంది. డిన్నర్ తీసుకుని ఒక గంట కూర్చుని వచ్చేద్దువుగాని" అన్నాడు రాజేష్.

"నేను అక్కడికి వస్తే చుట్టుపక్కల వాళ్ళు రావడం, ఇబ్బంది. దానికన్నా మీ ఆవిడనే హోటల్‌కి తీసుకురాకూడదూ"

"ఆ హోటల్, మీ జనం, ఆ వాతావరణం ఫ్రీగా ఉన్నట్టుండదు. అదే మా ఇంటికి వచ్చావనుకో హాయిగా మాట్లాడుకోవచ్చు. బయటి జనం ఎవ్వరూ రాకుండా జాగ్రత్త తీసుకుంటాను. నీకు వేరే అభ్యంతరం ఏమీ లేదుగా?"

"ఆ హోటల్, మీ జనం, ఆ వాతావరణం ఫ్రీగా ఉన్నట్టుండదు. అదే మా ఇంటికి వచ్చావనుకో హాయిగా మాట్లాడుకోవచ్చు. బయటి జనం ఎవ్వరూ రాకుండా జాగ్రత్త తీసుకుంటాను. నీకు వేరే అభ్యంతరం ఏమీ లేదుగా?"

"నువ్వు అంత అభిమానంగా పిలిస్తే రానని ఎలా అంటాను. మా కారు మీద వెళదాం" అంది.

"అదేమిటిరా దొరక్క దొరక్క ఏపిల్ పండు లాంటి పిల్ల దొరికితే ఆమె రూమ్‌కి నువ్వొక్కడివి వెళ్ళక, మీ ఇంటికి తీసుకువెళతానంటావు" పక్కకి తీసుకువెళ్ళి అన్నాడు రత్నాకర్.

"నోరు మూసుకుని మీరింక బయల్దేరండి" అని రాజేష్ వెళ్ళి కారెక్కాడు.

"నిన్ను ఇలా కలుస్తానని అనుకోలేదు. చాలా ఆనందంగా వుంది. నా స్నేహితురాలి ఆటోగ్రాఫ్ కోసం అంతమంది ఎగబడుతుంటే గర్వంగా కూడా వుంది" అన్నాడతను డ్రైవర్‌కి ఎటు వెళ్ళాలో సూచనలు ఇస్తూ.

"ఇలా సడన్‌గా గెస్ట్‌ని భోజనానికి తీసుకువస్తే నీ భార్య ఏమీ అనుకోదా? అందులోనూ గర్ల్‌ఫ్రెండ్‌ని" నవ్వుతూ అంది.

"నువ్వే చూస్తావుగా" అన్నాడు.

రాజేష్ తన ఇంటిముందు కారాపించాడు. ఇద్దరూ కారు దిగారు. అది ఒక చిన్న డాబా ఇల్లు. రాజేష్ కాలింగ్ బెల్ కొట్టాడు. అతని భార్య సరిత తలుపు తీసి భర్తతోపాటు వున్న సుధని ఆశ్చర్యంగా చూస్తూ అలాగే నిలబడిపోయింది.

"ఏమిటి అలా చూస్తున్నావు? ఈవిడెవరో చెప్పుకో చూద్దాం" అన్నాడు.

"అచ్చంగా టి.వి. సుధలా వున్నారు" అందామె.

"నీ మొహం సుధలా వుండడమేమిటి? ఈమె సుధే" అని సుధవైపు తిరిగి "ఈమె నా భార్య సరిత" అని పరిచయం చేసి, "లోపలికి పద మిగతా విషయాలు చెబుతాను" అన్నాడు భార్యతో. సరిత సుధనే సంభ్రమంగా చూస్తూ లోపలకు తీసుకువెళ్ళింది. రాజేష్ తలుపు వేసేశాడు.

"ఈవిడ మీకు సుధ. దానికన్నా ముందు కాలేజీలో నా క్లాస్‌మేట్ సాగరిక. ఈరోజు మన వూళ్ళో తన ప్రోగ్రాం జరిగింది. అదయ్యాక నువ్వు చూస్తావని తీసుకువచ్చాను".

"మంచిపని చేశారు" అని భర్తతో అని "ఇప్పుడే టి.విలో మీ ప్రోగ్రాం చూశాను. ఇంతలో మీరే ప్రత్యక్షమయ్యారు. నాకు చాలా ఆనందంగా వుంది. మా పక్కవాళ్ళమ్మాయికి మీరంటే చాలా ఇష్టం. పిలవనా?" అని సుధతో అంది సరిత.

"వద్దు పిలవకండి. నేను మీ ఇంటికి రాజేష్ స్నేహితురాలు సాగరికగా వచ్చాను."

"తన భోజనానికి ఏర్పాటు చెయ్యి" అన్నాడు రాజేష్ సరితతో.

"నా గురించి మీరు ప్రత్యేకంగా ఏమీ చెయ్యకండి. నేను రాత్రిళ్ళు చాలా లైట్‌గా భోజనం చేస్తాను" అంది సాగరిక. సరిత వంటింట్లోకి వెళ్ళింది. ఆమె వంట అయ్యేదాకా రాజేష్, సాగరిక హాల్లో కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు.

"నీ పిల్లలేరి?" అడిగింది సాగరిక.

"నాకు ఒక్కడే కొడుకు. నిద్రపోతున్నాడు"

"అబ్బ... వాతావరణం చాలా వేడిగా వుంది."

"నీకు ఏ.సి. అలవాటయి అలా అనిపిస్తోందేమో. మాకిది మామూలే" అన్నాడు రాజేష్.

వాళ్ళలా మాట్లాడుకుంటూ వుండగానే సరిత వంటపని పూర్తిచేసి ముగ్గురికీ వడ్డించింది.

"మీరు టి.విలో కనబడితే అసలు కదలబుద్ధి అవదు. అంత సరదాగా, చలాకీగా మాట్లాడతారు" అంది సరిత.

"థేంక్యూ"

"మొన్న పత్రికలో మీ ఇంటర్వ్యూ చదివాను. చాలా బాగా సమాధానాలిచ్చారు."

"అందులో సగానికి సగం అబద్ధాలే. టి.వి. గొడవ మానేసి మనం సరదాగా ఫ్రెండ్స్‌లా మాట్లాడుకుందాం. నేను తన క్లాస్‌మేట్‌నని రాజేష్ మీతో ఎప్పుడూ చెప్పలేదా?"

"అసలు నేను టి.వి. చూస్తే కదా, నువ్వు పెద్ద ఏంకర్‌వి అయ్యావని తెలిసేందుకు. ఫ్రెండ్స్ బలవంతం మీద నీ ప్రోగ్రాంకి రావడంతో నిన్ను కలవగలిగాను."

"మీ కాలేజ్ డేస్ గురించి చెప్పండి. మా ఆయన అప్పుడు కూడా ఇలాగే వుండేవారా? లేక ఏక్టివ్‌గా వుండేవారా?"

"కొన్ని నిజాలు చెబితే మీరు ఫీలవుతారు"

"నాకు ఆ భయం లేదులెండి. మా ఆయన బంగారం."

"అలా అనుకుంటున్నారా? ఇందాక ప్రోగ్రాం అయ్యాక నేను జనం మధ్యలో వుండగా మీ ఆయన ఏమని పిలిచారో తెలుసా?"

"ఏమన్నారు?"

"బీబీ అని పిలిచారు. బీబీ అంటే తెలుసుగా హిందీలో భార్యని అలా పిలుస్తారు".

"అదేమిటండీ అలా ఎందుకు పిలిచారు?"

"అది ఆరోజుల్లో మావాళ్ళు తనకి పెట్టిన పేరు. అలా పిలిస్తేనే కానీ తనతో మాట్లాడడం కుదరలేదు."

"నువ్వేగా నాకాపేరు పెట్టింది."

"ఇలాంటి పనులు కూడా చేసేవారా?"

"బాగుంది తను అనడం, నువ్వు నమ్మడం. నేను కాదు ఆ పేరు పెట్టింది. వేరే అతను."

"ఈయనేదో బుద్ధిమంతుడని మావాళ్ళు నన్నిచ్చి పెళ్ళి చేశారు. ఇంతకీ మా ఆయన కూడా మీవెంట పడేవారా?"

''ఆ పడేవారు. నేను ప్రిన్సిపాల్‌కి రిపోర్టు చేస్తానంటే భయపడి మానేశారు.''

''అంతదాకా వచ్చిందీ వ్యవహారం.''

''నువ్వు అలా వింటూ వుంటే అలాగే చెబుతుంది. మా కాలేజీలో చాలామంది కుర్రవాళ్ళు తన వెంటపడ్డ మాట నిజం. నేను మాత్రం వాళ్ళలో లేను.''

''మిస్టర్! దానికి నా దగ్గర ఆధారం ఉంది.''

''అమ్మో ఆధారమే. ఏమిటండీ అది'' భయపడుతున్నట్టు అడిగింది.

''మీ ఆయన రాసిన లవ్‌లెటర్''

''ఆ కళ కూడా వుందా ఈయన దగ్గర? ఎప్పుడైనా పుట్టింటికి వెళ్ళినప్పుడు లెటర్ రాయండి అంటే రాసేవారు కారు.''

''నువ్వు ఇది నమ్ముతున్నావా? సరదాకా నిన్ను ఆటపట్టించడానికి అంటోంది.''

''ఆరోజుల్లో నాకు వచ్చిన లెటర్స్ అన్నీ దాచాను. ఈసారి కలిసినప్పుడు చూపిస్తాను. నాకెప్పుడైనా సరదాపుడితే వాటిని మళ్ళీమళ్ళీ చదువుతూ వుంటాను. అన్నీ కంఠతా వచ్చేశాయి.

''నేను కష్టపడి సంపాదించిన డబ్బును, కొందరు దగ్గరివాళ్ళే నమ్మకాన్ని పెట్టుబడిగా పెట్టి సునాయాసంగా చేజిక్కించుకున్నప్పుడు నిస్సహాయంగా చూడడం తప్ప ఏమీ చెయ్యలేకపోయాను. రోజంతా షూటింగ్‌లతో ఎంత అలసిపోయినా నిద్ర మాత్రల సహాయం లేనిదే ఏ రాత్రీ నాకు నిద్రపట్టదంటే నా పరిస్థితిని నువ్వు ఊహించవచ్చు.''

''మా ఆయన ఏం రాశారండీ'' ఆసక్తిగా అడిగింది సరిత.

''మీ ఆయన నామీద చిన్న కవిత రాశారు. ఏం రాజేష్ ఆ కవిత నువ్వు వినిపిస్తావా? నేను వినిపించనా?''

''మీకు ఇది తప్ప వేరే టాపిక్ లేదా?'' అన్నాడు రాజేష్.

''అబ్బో కవిత్వమే. చెప్పండి, చెప్పండి'' అంది సరిత నవ్వుతూ.

కొద్దిసేపు ఆలోచించి ఆ కవితను వినిపించింది సాగరిక.

''ఆకాశంలో తారకవి<br>
స్వర్గంలో ఉండల్సిన మేనకవి<br>
దేముడు నాకోసం పంపిన కానుకవి<br>
నా మది నిండా నిలిచిన సాగరికవి''

''వాహ్వా... వాహ్వా'' అంది సరిత.

''ఈ లెటర్‌ని ప్రిన్సిపాల్‌కి చూపిస్తాను అనేసరికి భయపడి వారంరోజులు కాలేజీ మొహం చూడలేదు మీ ఆయన.''

''ఈమాత్రం లెటర్‌కే మా ఆయన్ని అంతలా బెదరగొట్టాలా?''

''అంతేకాదు ఆ లెటర్‌లో 'నన్ను ప్రేమించకపోతే కాలేజీ బిల్డింగ్ మీదనుంచి దూకేస్తా' అని కూడా రాశారు.''

''అప్పుడు కనుక సాగరిక నా ప్రేమని అంగీకరించి వుంటే నీ స్థానంలో వుండేది'' నవ్వుతూ అన్నాడు రాజేష్.

''అలా జరిగినా బావుండేది. నాకీ కష్టం తప్పుండేది'' అంది సరిత.

''అదేమిటండీ అలా అంటారు. ఇప్పుడు మీకేం కష్టం వచ్చింది''

''టి.వి. చూడరు. సినిమాలు చూడరు. ఒక సరదా లేదు. ఎప్పుడూ ఆ పుస్తకాలు చదువుతూ కూర్చోవడమే.''

ముగ్గురూ భోజనాలు పూర్తిచేసి హాల్లోకి వచ్చి కూర్చున్నారు.

''ఇంక కరెంట్ పోతుందేమో?'' అన్నాడు రాజేష్. అతని మాట పూర్తవకుండానే కరెంట్ పోయింది.

''బాబూ నీ నోటికి అంత మహత్తు వుందా?'' అంది సాగరిక.

''ఆఫీసులకి, స్కూళ్ళకి టైం వున్నట్టే కరెంట్ పోడవానికి కూడా ఒక టైం వుంటుంది. మీ ఇంటికి జనరేటర్ వుంటుంది కాబట్టి నీకది తెలియదు'' అని లేచి వెళ్ళి లాంతరు వెలిగించాడు.

''అసలే ఉక్కగా ఉంది. దానికితోడు కరెంట్ పోతే మరీ కష్టం'' అంది సాగరిక.

''అలా అనకు. దీనిలోనూ ఒక సుఖం వుంది. మీ టి.వి. ప్రోగ్రాంల దెబ్బకి భార్యాభర్తలకి తీరికగా మాట్లాడుకునే అవకాశం ఉండడం లేదు. ఇలా కరెంట్ పోయినప్పుడు డాబా మీదకు వెళ్ళి, చాపలేసుకుని పడుకుని, కబుర్లు చెప్పుకుంటుంటే చాలా హాయిగా వుంటుంది'' అన్నాడు రాజేష్.

అంతలో బెడ్‌రూంలోని ఫోన్ మ్రోగింది. ఫోన్ తీయడానికి సరిత లోపలకు వెళ్ళింది.

''మన కాలేజ్ ఫ్రెండ్స్ ఎవరైనా కనబడుతూ వుంటారా?'' అడిగాడు రాజేష్.

''అపుడపుడు. కానీ ఎందుకో చాలా మంది పైకి మర్యాదగానే వున్నా, మాటల్లో ఏదో వ్యంగ్యం వినబడుతూనే వుంటుంది. నీలా మనస్ఫూర్తిగా ఎవ్వరూ మాట్లాడలేదు. గిరి గుర్తున్నాడా? అతనైతే మరీ దారుణంగా మాట్లాడాడు'' బాధగా అంది.

''ఏమన్నాడు?''

''చెబితే బాధపడతావు.''

''నీకు అభ్యంతరం లేకపోతే చెప్పు''

''ఏదో ప్రోగ్రాంకి గుంటూరు వెళ్ళినపుడు కలిశాడు. అతనితో మరో ఇద్దరు స్నేహితులు కూడా వున్నారు. ఎదురుగా బాగానే మాట్లాడాడు. వెనక్కి తిరిగి వెళ్ళిపోతున్నప్పుడు నాకు వినబడాలని...''

''ఆపేశావేం.''

''దీని రేటులో మనకి కన్సెషన్ వుంటుంది. పాత స్నేహితుణ్ణి కదా అన్నాడు'' అంది అతికష్టం మీద.

''రాస్కెల్ అంత మాట అన్నాడా? చెడామడా తిట్టకపోయావా?'' కోపంగా అన్నాడు రాజేష్.

''అల్లరి చేసుకుంటే ఖరాబయ్యేది నా ఇమేజే. అతనికేం పోతుంది. సాధారణంగా బయటివాళ్ళు ఏవో కామెంట్స్ చేసుకుంటూనే వుంటారు. అవి ఎలాగూ తప్పవు. కానీ మీ విషయం వేరు. చిన్ననాటి స్నేహితులైన మీనుంచి అభిమానాన్ని ఆశించాను. కాలేజీ రోజుల నుంచి నాకు డైరీ రాసే అలవాటుండేది. ఎప్పుడైనా మనస్సు బాగాలేకపోతే పాత డైరీలు చదువుతూ వుండేదాన్ని. అవి నాకు ఎంతో ఊరటను కలిగించేవి. కానీ ఇప్పుడు వాటిని చదువుతుంటే గిరి లాంటి వాళ్ళ ప్రవర్తన గుర్తొచ్చి మనస్సు కెలికినట్టు అవుతోంది. అందుకని వాటిని చదవడం కూడా మానేశాను. ఆడిటోరియంలో నీతో మాట్లాడినపుడు పాత రోజులు తిరిగి వచ్చినట్టు అనిపించింది. లేకపోతే నీ ఇంటికి వచ్చివుండేదాన్ని కాను'' అని ఏదో ఆలోచిస్తూ ఒక్కక్షణం ఆగింది.

''నేను జీవితంలో విలువైన వాటిని చాలా కోల్పోయాను. కానీ మనస్సులోని సున్నితత్వాన్ని కోల్పోలేదు. ఎన్ని దెబ్బలు తిన్నా అది నన్ను వదలడంలేదు. అదే బాధ. నా తల్లి నా చిన్నప్పుడే పోకపోయినా, నా తండ్రి కుటుంబాన్ని బాధ్యతగా నిర్వహించి వున్నా నేను కూడా సరితగారి లాగా ప్రశాంత జీవితాన్ని గడుపుదును. మీకు సమస్యలు లేవని నేననడం లేదు. కానీ పంచుకోవడానికి ఒకరికి ఒకరు తోడున్నారు.. మా రంగుల ప్రపంచంలో విజయం సాధించినపుడు అభినందనలకి కొదవుండదు. విఫలమయినప్పుడు పంచుకోవడానికి తోడుండదు'' అంది సాగరిక.

''ఇప్పుడు నీకేం తక్కువ. బోలెడు డబ్బు, కీర్తి సంపాదించావు.''

''మీకు దూరం నుంచి దీపం మాత్రమే కనబడుతుంది. ప్రమిద కింద నీడ అణిగిమణిగి పడి వున్నట్టుగా వుంటూనే ఎప్పుడు అవకాశం దొరుకుతుందా దీపాన్ని మింగడానికి అని నిరంతరం ఎదురుచూస్తూనే వుంటుంది. నీడతో నిత్యం పోరాటం చెయ్యడంతోనే జీవితం గడిచిపోతుంది. ప్రమిదలోని చమురు అయిపోయాక వత్తి కాలక తప్పుతుందా. నేను ఈ స్థితికి రావడానికి ఎన్ని తిప్పలుపడ్డానో ఆ భగవంతుడికి తెలుసు. నేను కష్టపడి సంపాదించిన డబ్బును, కొందరు దగ్గరివాళ్ళే నమ్మకాన్ని పెట్టుబడిగా పెట్టి సునాయాసంగా చేజిక్కించుకున్నప్పుడు నిస్సహాయంగా చూడడం తప్ప ఏమీ చెయ్యలేకపోయాను. రోజంతా షూటింగ్‌లతో ఎంత అలసిపోయినా నిద్ర మాత్రల సహాయం లేనిదే ఏ రాత్రీ నాకు నిద్రపట్టదంటే నా పరిస్థితిని నువ్వు ఊహించవచ్చు.''

''పోనీ ఈ జీవితాన్ని వదిలేసి ఎవరినైనా పెళ్లి చేసుకుని ప్రశాంతంగా ఉండరాదా?''

''మా షూటింగ్‌లలో ఎక్కువ లైటింగ్‌ని ఇచ్చే పెద్ద బల్బ్‌లని వాడుతూ వుంటారు. వాటి కాంతిలో సెట్టు అంతా దేదీప్యమానంగా వెలిగిపోతూ బయటినుంచి చూసేవాళ్ళకి చాలా ఆకర్షణీయంగా వుంటుంది. కానీ ఆ లైట్లన్నీ తమ బెడ్‌రూంలో పెట్టుకోవాలని ఎవరూ అనుకోరు కదా. నా పరిస్థితీ అంతే. ప్రోగ్రాం చూసి చప్పట్లు కొడతారే తప్ప నన్నెవరు భరించగలరు చెప్పు'' బలవంతంగా నవ్వుతూ అంది సాగరిక.

రాజేష్ ఏదో అనబోతుండగా ఆమె సెల్‌ఫోన్ రింగయింది. ఆమె సర్దుకుని ఒక్కక్షణంలో మామూలు మూడ్‌లోకి వచ్చి సెల్ మాట్లాడింది.

''రాజేష్! నా గురించి మావాళ్లు ఎదురు చూస్తున్నారు. నేను బయల్దేరతాను.''

రాజేష్ సరితను పిలిచాడు. ఆమె వచ్చి సాగరికకి బొట్టుపెట్టి చీర చేతిలో పెట్టింది. ''ఇది సాదా చీర. ఇలాంటివి మీరు కట్టరు. కానీ అనుకోకుండా రావడంతో ఇంతకన్నా మంచి చీర పెట్టలేకపోతున్నాను'' ఇబ్బందిగా అంది.

''మీ ఇల్లు, మీరిచ్చిన డిన్నర్, ఈ చీర ఇవన్నీ సాధారణమైనవే. కానీ వాటికి మీ అభిమానం తోడై నాకు అపురూపంగా అనిపిస్తున్నాయి. నా జీవితంలో ఇలా బొట్టు పెట్టించుకుని, చీర తీసుకున్న సందర్భం ఇదే మొదటిది అంటే మీరు నమ్ముతారా? మీరిద్దరూ తప్పక మా ఇంటికి రావాలి. ఎప్పుడో చెప్పలేను కానీ నేను మళ్ళీ మీ ఆతిథ్యం అందుకోవడానికి వస్తాను'' అంది సాగరిక చెమర్చిన కళ్ళతో. కళ్ళద్దాలు పెట్టుకుని తనలోని అనుభూతిని దాచవలసిన అవసరం ఆమెకు ఆ ఇంటిలో కనిపించలేదు.

రాజేష్, సరిత బయటకు వచ్చి ఆమెకు వీడ్కోలు పలికారు. వేడిగా, అసౌకర్యంగా వున్న ఆ ఇంట్లోంచి ఏ.సి. కారులోకి ప్రవేశించినపుడు సంతోషానికి, భౌతిక సుఖానికి ఉన్న తేడాను ఆమె అనుభవపూర్వకంగా తెలుసుకుంది. ■